


## కిస్సాకుర్సీకా!

చెల్లూరి సీతా రాజేశ్వరరావు



డైరెక్టరు 'కట్' అని అరిచాడు. హీరోయిన్ సుమాల బ్రేక్ రావడంతో సెట్ నుంచి బయటికివచ్చింది. లాన్‌లోని తన కుర్చీలో ఓ యువకుడు కూర్చునివున్నాడు. సుమాల దగ్గరకెళ్ళింది. అయినా ఆ యువకుడు లేవలేదు. కూడా వుండే ఆయా "అమ్మగారి కుర్చీలో కూర్చుంటావా?" అని గదించింది.

"ఇంకా కుర్చీలు వున్నాయికదా! వాటిలో కూర్చోండి."

అతడిపేరు ముకుందం. హీరో అవుదామని వచ్చి లాభంలేక సైడువేషాలకోసం ప్రయత్నిస్తున్నాడు. సుమాలకి అతడి మొండివైఖరి చూడగానే కోపం వచ్చింది. తను సెట్లోవుంటే కుర్చీ ఖాళీగావుంటుంది. పెద్ద పెద్ద దర్శకులే అందులో కూర్చోరు!

"ఆ కుర్చీలో నీలాంటి వారు కూర్చోకూడదు."

"గొప్ప వారు కూర్చునే కుర్చీలా? నాకూ గొప్ప వాడిన్ని అవుదామని వుందిలెండి!"

వాదన పెరుగుతూండడం చూసి డైరెక్టరు వచ్చి "బాబూ! అది అమ్మగారి కుర్చీ! అందులో ఎవరూ కూర్చోరు. మరో చాంట్లో కూర్చో!" అనునయంగా చెప్పాడు!

"మీ వైభవం కుర్చీలో వుందన్నమాట. సారీ!" ముకుందం నవ్వుతూ లేచాడు!

సుమాల ఠీవిగా కూర్చుంది.

సినిమా రంగం విచిత్రమైన రంగం. ఎవరు ఏ క్షణాన పల్లకీ మీద వుంటారో, ఎవరు బోయీలవుతారో తెలియదు.

సుమాల క్రమంగా అమ్మ వేషాలకి ట్రాన్స్‌ఫర్ అయింది. కొన్నాళ్ళకి అవీ దొరకలేదు. సుమాల ఆర్థికంగా కూడా దెబ్బతింది. ఆమె సొంతంగా తీసిన సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. వెస్టు మాంబళంలో చిన్నగదిలో కాలక్షేపం చేస్తూ "దూరమైన" పరిశ్రమ చుట్టూ వేషాలకోసం తిరుగుతూంటుంది!

ఓ రోజున ఆమె నివసించే బొమ్మరిల్లు ముందు కారాగింది. డ్రయివర్ సుమాలను కలుసుకుని "డైరెకరుగారు వచ్చారు" అని చెప్పాడు.

"కబురు పెడితే నేనే వద్దునుకదండీ" డైరెక్టరుగార్ని లోపలికి పిలిచి కుర్చీ చూపింది.

డైరెక్టరు కూర్చోలేదు.

"మా పిక్చర్‌లో వేషం వుంది.

"థ్యాంక్యూ సర్. ప్రతిభని గుర్తిస్తారు మీరు."

"వేషం మీకు కాదు కుర్చీకి. పొలిటికల్ సెటైర్. నాయకుడు కుర్చీని సింహాసన మనుకుంటాడు. చివరకి పతనమైపోతాడు. చివర్న సింబాలిక్‌గా కుర్చీని మంటల్లో చూపిస్తాం. మీ దగ్గర మంచి కుర్చీ వుందని వచ్చాను!"

సుమాల పరిస్థితి ఎంత తలక్రిందులైనా ఆనాటి కుర్చీని అమ్మలేదు. కుర్చీని చూస్తుంటే గత వైభవం గుర్తు వస్తోంది.

"వేషం నాకివ్వకూడదూ!" అడిగేసింది దీనంగా.

"మీరు వెలిగిపోతున్నప్పుడు ఈ కుర్చీకి మీకిచ్చే గౌరవమే యివ్వవలసి వచ్చేది. అంటే కుర్చీ వేరు, మీరు వేరు కాదు. మీ బదులు కుర్చీ వేస్తోంది వేషం. సంతృప్తి పడలేరా?"

సుమాల అనుమానంగా 'మీరు?....' అంటూ చూసింది. "ముకుందాన్ని మీరు గెంటించిన ముకుందాన్ని. ఈరోజున డైరక్టర్ని అయ్యాను. మనిషి యెప్పుడూ నించోలేదు. కూర్చుంటాడు. అందుకే కుర్చీ! విలువ మనిషికి గాని వస్తువులకి కాదు. మీరిప్పుడు యిందులో కూర్చుంటే కొత్త వైభవం వస్తుందంటారా? ఆనాడు నాకు విలువలేదు కనుక కూర్చో వద్దన్నారు. నేడు వుంది కనుక కూర్చోమన్నారు!"

సుమాల మాట్లాడలేదు. తల వంచుకుంది.


"శరీరానికి గొడుగు పడతారు కాని నీడకి పట్టరు. కుర్చీ యివ్వదలుచుకుంటే ఫోన్ చెయ్యండి"

ముకుందం కారు వెళ్ళిపోయినా, ఆమె ఆలోచిస్తూండిపోయింది. తను తప్పు చేసిందా???

---

## పాపం సుభాష్

దారవనజ



బుల్లెట్ మీద వెళుతున్న సుభాష్ ప్రక్క నుంచి రయ్‌న దూసుకుపోయింది ఒక ఎట్టని కారు. అందులోనుంచి "భగవంతుడా నన్ను రక్షించు, అమ్మా. అయ్యా ఓ భగవాన్" అని రోదిస్తున్న ఒక స్త్రీ కంఠం వినిపించింది సుభాష్‌కు. ఆమె ప్రక్కనే ఒక పురుషుడ్ని కూడా చూశాడు సుభాష్. తాను ఎన్నో సినిమాల్లో ఇదే విధంగా ఆడవాళ్ళను ఎత్తుకుపోవడము, వారు ప్రాణాలు పోయేటట్లు ఆక్రోశించటమూ చూశాడు సుభాష్. ఆలస్యం చేయకూడదు. ఆ కార్లో కూర్చున్నవాడు తప్పకుండా రౌడీయే. పాపం, ఎవరో స్త్రీని దొంగిలించుకుపోతున్నాడు. ఆమెని యెలాగైనా రక్షించాలి అనుకున్నాడు మనసులో. అనుకోవటమే తడవుగా ఒక్కసారిగా బుల్లెట్

స్పీడ్ పెంచాడు హీరోలా. అంత ధైర్యం ఎలా వచ్చిందో తనకే తెలియలేదు సుభాష్‌కు. చాలా స్పీడుతో ఆ ఎర్ర కారుని చేరుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. అతని బుర్రనిండా అంతులేని ఆలోచనలు. ఆ స్త్రీని రక్షించి వాడికి మంచిబుద్ధి చెప్పాలి. తనపేరు పెద్ద పెద్ద అక్షరాలతో పేపరు ముందు పేజీలో పడాలి. ఆస్త్రీ- అచ్చే తాను రక్షించిన స్త్రీ సినిమాలో హీరోయిన్‌లా ఆమెను పెండ్లాడమని తన చెంతకువచ్చి ప్రాధేయపడాలి. ఇవీ సుభాష్ ఆలోచనలు. కారు శరవేగంతో పోతోంది. ఇక లాభం లేదని తన బుల్లెట్‌ను అడ్డదారిన పోనిచ్చాడు సుభాష్ తెలివిగా. కారుకంటే వేగంగా పోనిచ్చి ఆ కారుకు అడ్డుగా నిలిపాడు తన బుల్లెట్‌ను సుభాష్. కారు సడన్ బ్రేకుతో ఆగింది. సుభాష్ విజయ గర్వంతో "ఏరా బుద్ధిలేదూ ఒకఆడ.." అనే సరికే, "అడ్డులేవోయ్ ముందు. ఇవతల ఈవిడకు నొప్పులొస్తున్నాయని ఆసుపత్రికి తీసుకెళుతుంటే మధ్యలో ఏమిటి నీ వెధవ గోల. తప్పుకో," అని కారును బుల్లెట్ ప్రక్కనుంచి విసురుగా పోనిచ్చాడు డ్రైవర్. అప్పుడే ఆ కారులో ఒక స్త్రీ బాధతో మెలికలు తిరిగి పోతూండటం చూశాడు సుభాష్.

ఇక నోరెళ్ళబెట్టడం సుభాష్ వంతైంది. ❁

---

## ఔను! నిజం!

మా పురుషత్వం
వ్యభిచరించాలనుకుంటే —
కొనుక్కుంటుంది.
'సంసారం' చేయమంటే —
అమ్ముడుపోతుంది.

— నెల్లుట్ల జగన్

---

ఓ డి. ఇ. వో. గారికి రోజూ పచ్చిమిరపకాయ బజ్జీలు తినడం బాగా అలవాటు.




ఓ రోజు అలా తిని వస్తూ త్రోవలో కనబడ్డ ఓ స్కూల్లో జొరబడి హఠాత్తుగా ఇన్‌స్పెక్షన్ మొదలెట్టాడు. అయితే పక్క క్లాసులో నుంచి విపరీతమైన గొడవ వినబడుతూండేసరికి, కోపంగా ఆ క్లాసులోకి నడిచి అక్కడ గట్టిగా అరుస్తున్న ఓ కుర్రాడిని చొక్కాపట్టుకొని లాక్కొచ్చి తనకుర్చీ పక్కనే గోడకుర్చీ వేయమన్నాడు.

"అదికాదండీ! నేను...." అంటూ ఏదో చెప్పబోయాడా కుర్రాడు.

"నోర్మూసుకో! మాట్లాడావంటే పళ్ళు రాలగొడతాను." అన్నాడాయన.

"నేను.... చెప్పేది.... కొంచెం...."

ఇలా లాభం లేదని ఆ కుర్రాడి గూబ గుయ్‌మనిపించాడు డి. ఇ. వో.

"నోర్మూసుకొని ముందు గోడకుర్చీ వేస్తావా. లేదా?" అన్నాడు మళ్ళీ చెయ్యి లేపుతూ.

ఆ కుర్రాడు గోడకుర్చీ వేశాడు. కాసేపటి తర్వాత మళ్ళీ ప్రక్క క్లాసులోకి నడిచారాయన.


ఆ క్లాసు కుర్రాళ్ళు అందరూ ఆయనను చూడగానే లేచి నిలబడ్డారు

"కూర్చోండి! ఇంతకూ మీ టీచరేడీ?" అడిగాడాయన

కొద్ది నిమిషాల నిశ్శబ్దం తరువాత ఓ గొంతు నెమ్మదిగా అంది. "ఇందాక మీరు కాలర్ పట్టుకొని లాక్కుపోయింది మా టీచర్నేనండి!" ❁

---

ప్రయాణాలు మనిషికి జ్ఞానాన్ని యిస్తాయని ఒక ఆంగ్ల కవి అన్నారు.




అనుభవంమీద అది నిజమే అని తెలిసింది.

నేను తరచుగా ప్రయాణాలు చేస్తూ

---

